క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



వెంకటాపురం(కె) : మండలంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు బుధవారం ఎస్సై కొప్పుల తిరుపతిరావు తిరిగి వారికి సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన నాగమణి, సతీష్, శశికుమార్, ముకుందరావు సెల్‌ఫోన్లు పోగొట్టుకొని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కాగా సీఈఆర్ఐ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న వారి మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి రికవరీ చేశామని తెలిపారు. ఎవరైనా బాధితులు తమ ఫోన్లను పోగొట్టుకున్నట్లయితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

మద్యం తాగి, ప్లాస్టిక్ పడేసినందుకు జరిమానా

ఏటూరునాగారం : మండలంలోని చిన్నబోయినపల్లి ప్రాంతంలో సౌత్ రేంజ్ పరిధిలోని అడవిలో మద్యం తాగి, ప్లాస్టిక్‌ను పడవేసినందుకు జరిమానా విధించినట్లు సౌత్ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో మద్యం తాగి, ప్లాస్టిక్‌ను పడవేసినందుకు చట్టపరంగా చర్యలు చేపట్టారు. అభయారణ్యంలో మద్యం తాగిన వ్యక్తులు బూర వినయ్, గోటుకుల రాకేష్, కార్దూరి రాకేష్, గొటుకుల గణేష్, శంకర్, బక్షుల శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసి రూ.15వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అటవీ ప్రాంతంలో మద్యం తాగినా, ప్లాస్టిక్‌ను పడవేసినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ధాన్యం లోడు వాహనం బోల్తా



ఏటూరునాగారం : మండల కేంద్రంలోని జీడివాగు ప్రాంత పరిధిలో ధాన్యం లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం బుధవారం బోల్తా పడింది. డ్రైవర్ సోదారి రామయ్య కథనం ప్రకారం .. మండలంలోని రోహిర్ గ్రామం నుంచి డీసీఎంలో ధాన్యం బస్తాలను వేసుకొని రాజుపేటకు వెళ్తున్న క్రమంలో ఎదురుగా ఇసుక లారీ రావడంతో దాన్ని తప్పించేందుకు వాహనాన్ని పక్కకు తీస్తున్నప్పుడు వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టిందని, తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. కాని వాహనం క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైందన్నారు. సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపాడు. విషయాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నాడు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో విద్యుదాఘాతానికి గురై పాలిచ్చే ఆవు మృతి చెందింది. చెరుకూరుకు చెందిన మాద గురువయ్య ఆవు మేత కోసం వెళ్తుండగా విద్యుత్ స్తంభం వద్ద ఉన్న సపోర్టు వైరుకు తగిలింది. దీంతో అక్కడే ఉన్న కాల్వలో పడి మృతి చెందింది. విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి పరిశీలించారు. మృతి చెందిన ఆవు విలువ రూ.45 వేల వరకు ఉంటుందని రైతు తెలిపాడు.

పొలాల్లో ఎరగడి.. భయాందోళనలో ప్రజలు



వాజేడు : మండలంలోని జగన్నాథపురం సమపంలోని పొలాల్లో బుధవారం మధ్యాహ్నం ఎరగడి పడింది. వరికోతలు పూర్తి అయినప్పటికీ పొలాల్లో కొంత మందికి సంబంధించిన పశుగ్రాసం, ధాన్యం రాసులు, మిర్చి కల్లాల్లో ఉండిపోయాయి. ఆ సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పాయబాటల, జగన్నాథపురం గ్రామాల నుంచి స్థానికులు అక్కడికి వచ్చి పచ్చి రొట్టతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అదే సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో సమీపంలో మోటార్లు వేసి మంటలను ఆర్పివేశారు. పొలాల్లో ఉన్న ధాన్యం, మిర్చి కాల కుండా ఆపినప్పటికి పశుగ్రాసం మాత్రం పూర్తిగా కాలి పోయింది. బోర్లు, మోటార్లను మాత్రం దగ్గర ఉండి రైతులు కాపాడుకోగలిగారు. పొలాల్లో ఎరగడి ఎవరు పెట్టారనే విషయం ఎవరికి తెలియ లేదు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ



ఇస్లావత్ నందిని

ములుగు : మండలంలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కేజీబీవీ పాఠశాలలు ప్రతిభ చూపాయి. జిల్లాలో తొమ్మిది పాఠశాలల్లో ఆరు పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ గాదరి రమాదేవి తెలిపారు. మల్లంపల్లి మండలం గుర్తూర్ తండాకు చెందిన మాధవరావుపల్లి కేజీబీవీ విద్యార్థి ఇస్లావత్ నందిని 562 మార్కులు సాధించి టాప్‌లో నిలిచారు. మొత్తం 217 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 213 మంది పాస్ అయ్యారు. ఓవరాల్‌గా 98.16 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

ఏటూరునాగారం : ఏటూరునాగారంలో 407 మంది పరీక్షలు రాయగా 387 మంది ఉత్తీర్ణత పొందినట్లు ఎంఈఓ కొయ్యడ మల్లయ్య తెలిపారు. మండల టాపర్‌గా రామన్నగూడెం పాఠశాలకు చెందిన గార రక్షిత 600 మార్కులకు 571 మార్కులు వచ్చాయని, ద్వితీయ స్థానంలో ఇర్సవడ్ల శరణ్య 559, ఏటూరునాగారం పాఠశాలకు చెందిన రామ హర్షిత 559 మార్కులు సాధించారు. మండలంలో ఉత్తీర్ణతశాతం 95.08 శాతం నమోదు అయిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని తల్లిదండ్రులను ఎంఈఓ కోరారు.

కేజీబీవీలో నూరుశాతం ఉత్తీర్ణత

స్థానిక కేజీబీవీలో 26 మంది పరీక్షలు రాయగా 26 మంది ఉత్తీర్ణత పొందినట్లు ఎస్ఓ అరుణ తెలిపారు. అత్యధిక మార్కులు వంగరి లాస్య 555 మార్కులు సాధించారని తెలిపారు.

గిరిజన స్పోర్ట్స్ స్కూల్ వందశాతం

స్థానిక గిరిజన గురుకుల స్పోర్ట్స్ పాఠశాలలో 58 మంది పరీక్షలు రాయగా 58 మంది ఉత్తీర్ణత పొందినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వెంకటాపురంలో 98.9 శాతం ఉత్తీర్ణత

వెంకటాపురం(కె): మండలంలో పదో తరగతి ఫలితాల్లో 98.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్స్ గా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన గుడిమెట్ల లిఖిత 570, లక్ష్మి ప్రసన్న 569, శ్రీజల్ 569, రోహిత్ 553 లు ఉన్నారు



ఏటూరునాగారం : మండల టాపర్ రక్షితను అభినందిస్తున్న ఎంఈఓ మల్లయ్య



రుద్రరోషిణి



లక్ష్మీప్రసన్న



శ్రీజల్



రోహిత్

కేజీబీవీ ప్రభంజనం



వైష్ణవి



త్రిష

కన్నాయిగూడెం: పది ఫలితాల్లో మండలంలోని కేజీబీవీ విద్యార్థిని బుద్దె వైష్ణవి 554 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. అదే పాఠశాలకు చెందిన మంగలారపు త్రిష 541 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. మండలంలో మొత్తం నాలుగు జిల్లా పరిషత్ పాఠశాలల్లో 63 మంది పదో తరగతిలో పరీక్షలు రాయగా అందులో 61 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఇద్దరు మాత్రం ఫెయిల్ అయ్యారు. అందులో మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో 11 మందికి 11 మంది ఉత్తీర్ణులు కాగా ముప్పనపల్లిలోని కేజీబీవీలో 19 మందికి 19 మంది పాసయ్యారు. నాలుగేళ్ల నుంచి నుండి కేజీబీవీ 100 శాతం ఉత్తీర్ణతతో నిలుస్తుంది.

వాజేడులో నూరు శాతం ఉత్తీర్ణత



రుద్రరోషిణి



లొట్టిపిట్టల శ్రీవిఘ్ను

వాజేడు : బుధవారం విడుదలైన పదో తరగతి వార్షిక పరీక్షల్లో మండలం వ్యాప్తంగా 100 శాతం ఉత్తీర్ణతను సాధించింది. స్థానిక ఉన్నత పాఠశాల నుంచి పరీక్షలకు హాజరైన రుద్ర రోషిణి 563 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. పెద్ద గొళ్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి లొట్టిపిట్టల శ్రీవిఘ్ను 541 మార్కులు, ధర్మవరం నుంచి రోషిణి 504, కస్తూర్బా గాంధీ నుంచి దీప్తి 510, పేరూరు నుంచి తోట భానుచరణ్ 511 మార్కులతో ఆయా పాఠశాలల టాపర్లుగా నిలిచారు.

గోవిందరావుపేటలో 99.17 శాతం

గోవిందరావుపేట : పది తరగతి ఫలితాల్లో మండలం నుంచి ప్రభుత్వ పాఠశాలల తరపున 136 మంది బాలురు పరీక్ష రాయగా 135 మంది, 104 మంది బాలికలు పరీక్ష రాయగా 103 మంది ఉత్తీర్ణత సాధించారని, మండల ఉత్తీర్ణత శాతం 99.17 శాతం నమోదైనట్లు ఎంఈఓ గొంది దివాకర తెలిపారు. చల్వాయి జెడ్పీఎస్ఎస్ విద్యార్థి కారుణ్య 577/600 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవగా ఎంఈఓ దివాకర్, హెచ్ఎం కాటం మల్లారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ తేల్ల హరిత అభినందించారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న ఆయా సంఘాల నాయకులు

ములుగు : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ, గిరిజన, దళిత సంఘాలు జిల్లాకేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన తరువాత క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మంత్రి డాక్టర్ సీతక్కకు వినతిపత్రం అందించారు. నక్సలైట్ల నిర్మూలన పేరుతో కేంద్రబలగాలు తెలంగాణ– ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు ఆదివాసీ ప్రాంతంలో ఆపరేషన్ కగార్ పేరుతో చేపడుతున్న సైనిక చర్యతో ఆదివాసీలు అనేక కష్టాలను అనుభవిస్తున్నారని అన్నారు. పోలీసుల భయంతో యువకులు ఇతర ప్రాంతాలకు పారిపోయి దుర్భరజీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క ప్రభుత్వంతో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్, గోర్ సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ రాథోడ్, శాంతిచర్చల కమిటీ సభ్యుడు రామ్మూర్తి, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్, ట్రైబల్ డెమోక్రటిక్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్‌సింగ్, వెంకటేశ్వర్లు, సమ్మయ్య రాథోడ్, నర్సయ్య, రవి, లచ్చు పటేల్, సునిల్ పాల్గొన్నారు.

హామీ పత్రాలపై సంతకాలు చేయం

వాజేడు: మొక్కజొన్న పంట నుంచి రైతులకు రావాల్సిన నష్టపరిహారానికి సంబంధించి హామీ పత్రాలపై సంతకాలు చేయాలని ఆర్గనైజర్లు రాగా తాము చేసేది లేదని బాధిత రైతులు తేల్చి చెప్పారు. మండల పరిధిలోని రైతు వేదికలో బుధవారం వ్యవసాయ శాఖాధికారులు మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. కాగా తమకు ఇచ్చిన పెట్టు బడి కంటే ఎక్కువగా పద్దులు రాసుకువచ్చారని తమ వద్ద అందుకు సంబంధించిన వివరాలు ఉన్నాయని దాని ప్రకారం తమకు రావాల్సిన పరిహారం డబ్బులు ఇవ్వాలని రైతులు కోరారు. పరిహారం డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని, అలా కాకుండా ఆర్గనైజర్ ఖాతాల్లో వేయవద్దని వివరించారు. వ్యవసాయాధికారి మహేశ్, ఏఈఓ హరీష్, జాఫర్, రాధిక రైతుల నుంచి వివరాలను స్వీకరించారు. అక్కడి నుంచి కొందరు రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడు చెప్పు కోవడానికి ములుగుకు తరలివెళ్లారు.



అధికారులు, ఆర్గనైజర్లతో మాట్లాడుతున్న రైతులు

ఏజెన్సీలో హక్కులు, మనుగడను కాపాడాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఏటూరు నాగారం డివిజన్ అధ్యక్షుడు బుచ్చయ్య

వాజేడు : ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల హక్కులతో పాటు వారి మనుగడను కాపాడాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఏటూరు నాగారం డివిజన్ అధ్యక్షుడు టింగ బుచ్చయ్య అన్నారు. బుధవారం మండలంలోని పేరూరులో మండల అధ్యక్షుడు లొడిగె నర్సింహారావు అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం ఏజెన్సీపై కుట్రలు, కుతంత్రాలు చేస్తూ ఆదివాసీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందని ఆరోపించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల రక్షణకై మాట్లాడాల్సిన ఆదివాసీ రాజకీయ నాయకులు వారి వారి పార్టీల ఎజెండాను మోస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సుధాకర్, ప్రశాంత్, నర్సింహారావు, రాజేష్, రఘు, సురేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న టింగ బుచ్చయ్య

హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలికల ప్రతిభ



రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలో తృతీయ బహుమతి గెలుపొందిన రాధిక, కీర్తన

ఏటూరునాగారం: మందమర్రి సింగరేణి స్పోర్ట్స్ క్రీడా మైదానంలో ఇటీవల నిర్వహించిన 54వ తెలంగాణ రాష్ట్ర బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున ఇద్దరు బాలికలు పాల్గొని తృతీయ బహుమతి గెలుచుకున్నట్లు ఏటూరునాగారం స్పోర్ట్స్ కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు. ఈ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన రాధిక, కీర్తనలను ప్రతిభ చూపి తృతీయ బహుమతి గెలువగా వారిని పలువురు అభినందించారు.

కారులో తరలిస్తున్న నల్లబెల్లం, పటిక పట్టివేత



నిందితులను చూపిస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామం వద్ద బుధవారం పోలీసులు నల్లబెల్లం, పటిక పట్టుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం గుమ్మడిదొడ్డి వద్ద ఎస్పీ డాక్టర్ శబరీస్ ఆదేశాలు, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఉత్తర్వుల మేరకు వాహన తనిఖీలను వెంకటాపురం(కె) సీఐ బందారి కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అటుగా వస్తున్న కారు పోలీసులను చూసి తప్పించుకుని పోతుండటంతో వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. కారులో రెండు క్వింటాల నల్లబెల్లం, 20 కేజీల పటిక ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మండలంలోని బొమ్మనపల్లికి చెందిన ముప్పిరి రాంకుమార్, మండపాక గ్రామానికి చెందిన చిచ్చడి శరత్, వెంకటాపురం(కె) మండల పరిధిలోని పాత్రాపురం గ్రామానికి చెందిన బట్ట శ్రీనులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కారు, బెల్లం, పటికను స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు చెప్పారు.

ఫర్టిలైజర్ షాపుల లైసెన్స్‌లు రద్దు చేయాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీలో గిరిజనేతరులకు ఇచ్చిన ఫర్టిలైజర్ షాపుల లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తాటి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులకు ఫర్టిలైజర్ షాపులకు లైసెన్స్‌లు ఇచ్చారని వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొగ్గుల సమ్మయ్య, శ్యామల వెంకటేశ్వర్లు, పీర్ల మలికార్జునరావు, శ్యామల ప్రసాద్, రామకృష్ణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

సహకార సంఘాలతో రైతులకు ప్రయోజనం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం : రైతులకు ప్రోత్సాహం, ప్రయోజనాలు చేకూర్చడమే లక్ష్యంగా హకార సంఘాలు సేవలందిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. సహకార సంవత్సర వేడుకల టీషర్టును మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంఘాల బలోపేతం, సేవలను మరింత విస్తృతపర్చడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఓ వాల్యా నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజు, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, సీఈఓ ఎడ్ల సతీశ్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, రాజబాబు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఇందిరమ్మ ఇళ్లకు మంత్రి భూమిపూజ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ఎలికేశ్వరంలో ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భూమి పూజ చేశారు. బుధవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు ఉన్నారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి



అంబేడ్కర్ సెంటర్‌లో ర్యాలీలో పాల్గొన్న సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్ : అమాయకపు ప్రజలను బలిగొంటున్న ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కశ్మీర్‌లో ఉగ్రమూకల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ జిల్లా కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధిచెప్పాలని, ఉగ్రవాదాన్ని అంతమొందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, భాస్కర్, కృష్ణప్రసాద్, రవితేజ, కుమారస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి భాపూలే బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గట్టయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మే 12లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

మల్లెంపల్లిలో సివిల్ రైట్స్ డే

మల్హర్ : మండలంలోని మల్లెంపల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారులు సివిల్ రైట్స్ డే (పౌరహక్కుల దినోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వ సంక్షేమ ఫథకాల వివరాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు నరేష్, సతీష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కాటారం: రైతులు పండించిన ధాన్యంకు మద్దతు ధర కల్పించడం కోసం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ అన్నారు. మండలంలోని జాదారావుపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బండి రమేశ్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు వంశీవర్ధన్, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రశాంత్

బసవేశ్వర జయంతి వేడుకలు

భూపాలపల్లి రూరల్: బసవేశ్వర జయంతి వేడుకలను బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి శైలజ బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. బసవేశ్వరుడు దేశంలో సమానత్వానికి, మానవతా విలువలకు ప్రాతినిధ్యం వహించిన మహానుభావుడని కొనియాడారు. బసవేశ్వరుడి సేవలు నేటితరాలకు తెలియాలనే లక్ష్యంలో ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో వీర శైవ లింగయత్, వివిధ కులసంఘాల నాయకులు, కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న అధికారులు, నాయకులు

మానవత్వం చాటుకున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో కారు, ఆటో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. బుధవారం సాయంత్రం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండలంలోని ఎలికేశ్వరం గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో తన కాన్వాయి నిలిపి క్షతగాత్రులను పరామర్శించి వెంటనే తన కాన్వాయ్‌లోని వాహనంలో మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. వేల్పుల మౌనిక, బొగ్గుల శైలజ, చిన్న రాములు, సమత, మౌనిక, సుజాత, ఐశ్వర్య, ద్రాక్షయిని, దుర్గక్క, రవళిలకు గాయాలయ్యాయి. వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు.



క్షతగాత్రులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు